# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-03-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, మాజీ ఉపప్రధాని ఎల్‌కే అద్వానీకి రాష్ట్రపతి ద్రౌపదీముర్ము దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రదానం చేశారు.**

**2.** **ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో భారత స్థూల దేశీయోత్పత్తి - జీడీపీ 8 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధి చెందుతుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.**

**3.** **సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సీ-విజిల్ యాప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.**

**4.** **దేశంలో రేపటి నుంచి బీమా సంస్థలు పాలసీలను డిజిటల్ రూపంలో అందించనున్నాయి.**

**5.** **ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఈరోజు సాయంత్రం ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య విశాఖపట్నంలో మ్యాచ్ జరగనుంది.**

==========================

భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నను ప్రదానం చేశారు. ఈరోజు ఉదయం దిల్లీలోని అద్వానీ నివాసానికి వెళ్లి రాష్ట్రపతి ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ దన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తదితరులు పాల్గొన్నారు.

--------------------------

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో భారత స్థూల దేశీయోత్పత్తి – జీడీపీ 8 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధి చెందుతుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ముంబయిలో ఈరోజు జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఆమె మాట్లాడుతూ, మెరుగైన ద్రవ్యోల్బణ నిర్వహణ, స్థూల ఆర్థిక స్థిరత్వం ప్రభావం కారణంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక వ్యవస్థ అదే వృద్ధి రేటును చూపుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఆసియాలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారతదేశం అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ఏడాది ప్రాతిపదికన 8.4 శాతం వృద్ధిని సాధించిందని... గత త్రైమాసికంలో నమోదైన

7.6 శాతం వృద్ధిని అధిగమించిందని ఆమె వెల్లడించారు. మూడవ త్రైమాసికంలో 8.4 శాతం వృద్ధిని అనుసరించి, వివిధ సంస్థలు భారత్ జిడిపి వృద్ధి అంచనాలను పెంచాయని ఆర్థికమంత్రి పేర్కొన్నారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే పౌరులు స్వేచ్ఛగా ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సీ-విజిల్ యాప్‌కు విశేష స్పందన లభిస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటివరకు 83 ఫిర్యాదులు రాగా వాటిన్నింటినీ పరిష్కరించామని అధికారులు తెలిపారు. సీ-విజిల్ యాప్ ఫిర్యాదులు స్వీకరించి నియోజకవర్గాల వారీగా వాటిని పంపించి పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏది జరిగినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశాన్ని కల్పించింది.

---------------------------

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై ఎన్నికల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాల్‌లో ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ నమూనా పోస్టల్ బ్యాలెట్లతో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఓటర్లు, అత్యవసర సర్వీసులలో పాల్గొనే ఉద్యోగులు, 85 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు.

---------------------------

ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగు పడడం వల్ల విద్యార్థి మానసిక ఆలోచన మారుతుందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. నిన్న పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిశిఖర ప్రాంతాల్లో నిన్న ఆయన పర్యటించారు. తోట గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వొండ్రుబంగి గ్రామానికి చేరుకొని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించగా పూర్తి స్థాయిలో క్లాస్‌లు పూర్తికాకపోవడాన్ని గుర్తించారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో సైతం లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తమ పరిధిలోని ప్రతి అంశాన్ని తీవ్రంగా పరిగణించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు

---------------------------

దేశంలో రేపటి నుంచి బీమా పాలసీలు కొనుగోలు చేస్తే, ఆయా సంస్థలు డిజిటల్ రూపంలోనే పాలసీలను అందించనున్నాయి. భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ – ఐ.ఆర్.డీ.ఏ.ఐ. ఆదేశాల మేరకు పాలసీదార్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ విధానంలోకి సంస్థలు మారుతున్నాయి. స్టాక్ మార్కెట్‌లో డీమ్యాట్ తరహాలోనే బీమా పాలసీలకూ డీమెటీరియలైజ్డ్ ఫామ్‌లో 4 బీమా రిపాజిటరీలను ఏర్పాటు చేశారు. సీ.ఏ.ఎం.ఎస్. రిపాజిటరీ, కార్వీ, ఎన్.ఎస్.డీ.ఎల్. డేటాబేస్ మేనేజ్‌మెంట్, సెంట్రల్ ఇన్సూరెన్స్ రిపాజిటరీ ఆఫ్ ఇండియాలు వీటిని నిర్వహిస్తాయి

---------------------------

శిలువ వేసిన అనంతరం ఏసుక్రీస్తు పునరుత్థానానికి ప్రతీకగా ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఈరోజు ఈస్టర్ పండుగను జరుపుకుంటున్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏసుక్రీస్తు పునరుత్థానం ప్రేమ, కరుణ, క్షమా గుణాలను సూచిస్తుందని వారు తమ తమ సందేశాల్లో పేర్కొన్నారు. ప్రజలు శాంతియుతంగా జీవించడానికి ఈ పండుగను స్ఫూర్తిగా తీసుకోవాలని వారు ఆకాంక్షించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి తమ ఓటు హక్కును దేశాభివృద్ధి కోసం వినియోగించుకుంటామని చెబుతున్నారు యువ ఓటర్లు. యువ ఓటర్లను ప్రోత్సహించేందుకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పలు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఓటు నమోదు.. ఓటు హక్కు వినియోగంపై యువ ఓటర్లకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాకు చెందిన పలువురు యువ ఓటర్లు ఆకాశవాణితో తమ అభిప్రాయాలను పంచుకుంటూ...

**......వాయిస్... 45 సెకన్లు.....**

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఈరోజు సాయంత్రం 7 గంటల 30 నిమిషాలకు ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరగనుండడంతో విశాఖపట్నంలో సందడి నెలకొంది. అయిదేళ్ల విరామం తర్వాత ఇక్కడి వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో తిరిగి ఐపీఎల్ మ్యాచ్ జరగబోతోంది. ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌ల కోసం విశాఖను దిల్లీ సొంత వేదికగా ఎంచుకోవడంతో, మరో మ్యాచ్ బుధవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడుతుంది. ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు విశాఖ చేరుకున్నాయి.

---------------------------

ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి రాగానే పాత ఇసుక విధానాన్ని తీసుకొస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. మైనింగ్ విభాగంపై విచారణ కమిటీ వేస్తామని చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆయన ఈరోజు స్థానికులతో సమావేశమై మాట్లాడారు. ఇంటి పన్ను, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తాము తగ్గిస్తామని హామీ ఇచ్చారు. అక్రమ మద్య నియంత్రణ పాలసీని తీసుకొస్తామని, వ్యవసాయ ఆధారిత ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

---------------------------

పులిచింతల నుంచి కృష్ణాజిల్లాలో కాల్వలకు ఏప్రిల్ 6వ తేదీన నీరు విడుదల చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.రాజబాబు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులతో తాగునీటి సరఫరా అంశాలపై నిన్న అయన సమీక్షించారు. ప్రత్యేకించి తాగునీటి అవసరాల కోసం పులిచింతల నుంచి నీటిని విడుదల చేస్తున్నారని, అవి రెండు మూడు రోజుల వ్యవధిలో జిల్లాకు చేరుకునే అవకాశం ఉందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధానంగా మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలోని శివారు గ్రామాలకు నీరు చేరేలా కాల్వలను సిద్ధం చేయాలని, తాగునీటి చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాల్వల ద్వారా వచ్చే నీటిని తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు మళ్లించకుండా రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, సంబంధిత శాఖల సిబ్బందితో పహరా బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఆ రోజు ఉదయం 3 గంటలకు సుప్రభాతం, అనంతరం ఆలయ శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారికి, విష్వక్సేనులవారికి విశేష సమర్పణ, 7 నుంచి 9 గంటల మధ్య విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపు చేపట్టి ఆలయంలోకి ప్రవేశిస్తారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ పఠనం ఉంటుంది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు ఉగాది ఆస్థానం నిర్వహిస్తారు. ఈ పర్వదినం పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది.

=====================